రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు

గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ విశిష్ట సంస్కృతి, విభిన్న జీవనం, ప్రకృతి, పర్యావరణానికి బోనాల పండుగ ప్రతిబింబం అని కొనియాడారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలనీ, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మహంకాళి దేవి ఆశీర్వాదంతో కోవిడ్-19 దాదాపు నియంత్రించబడిందనీ, ప్రజలు సాధారణ జీవితాలకు తిరిగి వచ్చారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 2.13 శాతం పాజిటివ్ రేటు

612 మందికి కరోనా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో కొత్తగా 612 మందికి కరోనా సోకింది. శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 5.30 గంటల వరకు 24,927 మందికి టెస్టులు చేయగా బయటపడినట్టు కోవిడ్-19 మీడియా బులెటిన్ వెల్లడించింది. 612 మంది డిశ్చార్జి అయ్యారు.111మంది రిపోర్టులు రావాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 4,630యాక్టివ్ కేసులున్నాయి. వీరిలో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో 89 మంది చికిత్స పొందుతున్నారు. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో అత్యధికంగా 281 మందికి కరోనా సోకింది. రాష్ట్రంలో పాజిటివ్ రేటు 2.13 శాతంగా నమోదయింది.

ట్రేడ్ యూనియన్లతో ఆర్థిక సంక్షోభాలకు చెక్

- కార్మిక సంఘాలు బలంగా ఉండాలని కోరుకుంటున్న బైడెన్
- పెట్టుబడిదారీ వ్యవస్థలోని తాజా పరిస్థితులే కారణం
- కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరిస్తున్న బిజెపి
- ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ట్రేడ్ యూనియన్లు బలంగా ఉంటేనే కార్మికులకు మెరుగైన జీతాలు లభిస్తాయనీ, ఎక్కడైతే బలహీనంగా ఉంటాయో ఆయా దేశాలలో సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో అవి ఆర్థిక పతనం దిశగా సాగుతాయని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు అభిప్రాయపడ్డారు. కార్మికులు బలమైన పోరాటాల ద్వారా భిన్నమైన ప్రపంచం వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కవాడీగూడలోని సిజిఒ టవర్స్‌లో కాన్ఫిడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్, వర్కర్స్ (సిసిఇఇడబ్ల్యు) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ యూనిట్ 13వ మహాసభ ఆ యూనియన్ చైర్మెన్ నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి పాపారావు మాట్లాడుతూ.. పెట్టుబడిదారీ వ్యవస్థ ఒడిదుడుకుల వల్ల అమెరికాలో ఆర్థికపరిస్థితి కూలిపోయేస్థితికి చేరకుందనీ, డాలర్ విలువ ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. అందుకే అమెరికా అధ్యక్షులు బైడెన్ బలమైన కార్మిక సంఘాలు ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నారని వివరించారు. సామాన్య ప్రజానీకం బాగుంటేనే సమాజం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మోడీ సర్కారేమో పెట్టుబడిదారులు, కార్పొరేట్ల సంపద పెరిగితే పేదలు బాగుంటారనే ఆలోచనతో ముందుకెళ్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే కార్పొరేట్ల మేలు కోసం కార్మికకోడ్‌లను తెచ్చిందన్నారు. ప్రపంచ కుబేరుడు వారన్ బఫెట్ సంపన్నుల మీద పన్నులు వేయాలని కోరుతుంటే.. మన దేశంలోనేమో మోడీ సర్కారు అంబానీ, అదానీ, తదితర కార్పొరేట్ దిగ్గజాలకు రాయితీలమీద రాయితీలిస్తూ పేదల మీద జిఎస్‌టి పేరుతో భారాలు మోపుతూ పోతున్నదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1990 వరకు మన దేశంలో సోషలిస్టు భావజాలం ఆధారితంగా పాలన నడిచిందన్నారు. ఆ తర్వాత మనం అమెరికా ప్రేరేపితమైన సంస్కరణలను పాలకులు తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకులు మన దేశానికి ఖర్చులు తగ్గించాలనీ, సంక్షేమపథకాల్లో కోత విధించాలనీ, ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించి పెన్షన్లు తొలగించాలని షరతులు విధించాయని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తున్నాయని వివరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కారు ఉద్యోగుల మీద ఖర్చును తగ్గించి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దాని గురించే ఆలోచిస్తోందని విమర్శించారు. టెలికాం, రక్షణరంగాల్లోకి ప్రయివేటు పెట్టుబడుల ఆహ్వానం తర్వాత దేశ భద్రతకే ప్రమాదం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కులం, మతం, ప్రాంతం ఇలా ప్రతి కారణాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను చీల్చి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్లకు కారుచౌక కట్టబెట్టేందుకు కొత్తకొత్త పథకాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్నదని విమర్శించారు. మరోవైపు ప్రజలు తినే తిండిపైనా జిఎస్‌టి భారాన్ని మోపుతున్నదన్నారు. రాజుల కాలంలో జుట్టుపై పన్ను వేసేవారని విన్నాంగానీ...ఇప్పుడు మోడీ హయాంలో స్వయంగా చూస్తున్నామని విమర్శించారు. ఆజాదీకా అమృత్‌మహోత్సవ్ ఎవరి కోసం అని ప్రశ్నించారు. ఆ ఉత్సవాలను ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లను అమ్మేస్తున్నందుకు జరుపుకోవాలా? ఉద్యోగులను తొలగిస్తున్నందుకు నిర్వహించాలా? జిఎస్‌టి భారాలు మోపుతున్నందుకు చేయాలా? దేశాన్ని అమ్మేస్తున్నందుకు నిర్వహించాలా? అని నిలదీశారు. ఎఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు యూసుఫ్ మాట్లాడుతూ..మన దేశంలో రష్యా సహకారంతో ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం అయిందన్నారు. ప్రపంచ దేశాలన్నీ రష్యావైపు చూస్తుండటంతో అమెరికా నేతృత్వంలోని 32 పెట్టుబడిదారీ దేశాలు కుయుక్తులు పన్ని సోవియట్ రష్యాను దెబ్బతీశాయన్నారు. ఆ తర్వాత అమెరికా ఎల్‌పిజి విధానాలతో అన్ని దేశాలనూ దోచుకునే పద్ధతిని మొదలుపెట్టిందని విమర్శించారు. ఓవైపు కార్పొరేట్ల కోసం దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ మరోవైపు సామాన్యులు, పేదలు దేశం కోసం త్యాగాలు చేయాలని మోడీ పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ రంగంలోనూ రెగ్యులర్ ఉద్యోగులుండరనీ, అగ్నిపథ్‌తోనే మిలిటరీలో టైమ్ బాండ్ ఎంప్లాయిమెంట్ పద్ధతిని మోడీ సర్కారు తీసుకొచ్చిందని విమర్శించారు. నేడు దేశంలో వ్యాపారస్తుల పార్టీ అధికారంలో ఉందని ఆరోపించారు. కార్మికులు, ఉద్యోగులు కలిసికట్టుగా కేంద్ర విధానాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిసిఇఇడబ్ల్యు ప్రధాన కార్యదర్శి ఎ.అజీజ్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఎఐడిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి జిటి గోపాల్‌రావు, ఆయా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు కృష్ణమోహన్, ముక్తార్, ప్రభాకర్‌నాయర్, ఎమ్ఎన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా

కెటిఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కెటిఆర్ జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిరాడంబరంగా జరిగాయి. వరంగల్ జిల్లాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కేక్ కట్ చేశారు. మంత్రి కెటిఆర్ ఆయురారోగ్యాలతో నిండూ నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. టిఆర్ఎస్ శ్రేణులు గ్రామగ్రామాన మొక్కలు నాటాయి. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. నిరుపేదలకు సహాయం చేశారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో కెటిఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండలోని సన్నిధి అనాథాశ్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ కేక్ కట్ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ తలసాని సాయి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మంత్రి కెటిఆర్‌పై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఇసుకతో రూపొందించిన కెటిఆర్ చిత్రం (స్యాండ్ ఆర్ట్), త్రీడీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కెటిఆర్‌కు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాలికి తగిలిన గాయం వల్ల ప్రజాసేవకు కొంత అంతరాయం కలిగిందని తెలిసిందని, ఈ గాయం నుంచి త్వరగా కోలుకుని ప్రజాసేవలో మమేకం కావాలని ఆకాంక్షించారు. వేదం ఫౌండేషన్ చైర్మన్, టిఆర్ఎస్ నాయకుడు అలిశెట్టి అరవింద్ వినూత్న రీతిలో కార్లపై హ్యాపీ బర్త్ డే కెటిఆర్ అని ప్రదర్శించి విషెస్ చెప్పారు. హైదరాబాద్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపైన కార్లతో ప్రదర్శన నిర్వహించారు. టిఆర్ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిఆర్ఎస్ ఎన్నారై కువైట్ ఆధ్వర్యంలో కెటిఆర్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.

కన్నెపల్లి మోటార్ పంపుల

మునక మానవతప్పిదమే..

- నిర్మాణ లోపాలతో కాళేశ్వరం ప్రాజెక్టు
- జరిగిన నష్టాన్ని మెగా సంస్థే భరించాలి
- అవినీతి ఎస్ఇలను సస్పెండ్ చేయాలి
- ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మాణ వైఫల్యం, అవినీతి అక్రమాలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, కన్నేపల్లిలో 11 మోటారు పంపులు మునిగిపోయాయని, వాటికి కనీసం రక్షణాచర్యలు ఏర్పాటుచేయకపోవడం మానవతప్పిదమేనని అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి తెలిపారు. ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో భద్రాచలం ముంపునకు గురైతే.. ముఖ్యమంత్రి తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వరుసగా కురిసిన వర్షాలకు విదేశీ కుట్ర చేసి, క్లౌడ్ బ్రెస్ట్ జరిగిందంటూ ప్రజల ఆలోచనలు మళ్లించారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూ.35,500 కోట్లతో డిజైన్ చేస్తే కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రీ డిజైన్ చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని రూ.1,10,000 కోట్లు ఎస్టిమేషన్ చేశారని తెలిపారు. ప్రాణహిత చేవెళ్లకు మూడురెట్లు నిర్మాణ ఖర్చులను పెంచారన్నారు. ఇప్పటికే రూ.80 వేల కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతున్న ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించిన మెగా కంపెనీకి పెద్దఎత్తున లాభాలను దోచిపెట్టిందని చెప్పారు.

ప్రాజెక్టు నిర్మించినప్పుడు మోటార్ల రక్షణకు ఏర్పాట్లు చేయాలని, కానీ వాటి రక్షణపై ఎస్ఇ పెంటారెడ్డి దుర్మార్గమైన కామెంట్ చేశారని విమర్శించారు. వాస్తవానికి కరెంటు మోటార్లలో వరద వచ్చినప్పుడు ఒంట్రుమట్టి చేరుతుందని, దాంతో వాటిలో రివైండింగ్ చేయడానికి రూ. 20 కోట్లు కావాల్సి వస్తుందన్నారు. ఇలాంటివేవీ పరిగణలోకి తీసుకోకుండా ఎస్ఇ దుర్మార్గపూరితంగా ఆలోచించారని అన్నారు. గతంలో కల్వకుర్తి పంపుసెట్లు శ్రీశైలంలో మునిగిపోయిన సంఘటనలు కండ్ల ముందున్నా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మానవ తప్పిదాలను చేసి ప్రకృతిపై రుద్దడం పద్ధతి కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 12 లిఫ్ట్ పథకాలు ఉంటే 4550 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని, దీని నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి అనేక రకాలుగా మాటలు మారుస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హైడ్రాలిక్ సిస్టం తప్పుగా ఉందని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సిడబ్ల్యుసి, ఫారెస్ట్, పర్యావరణం, టెక్నికల్‌కు సంబంధించిన అన్ని రకాల అనుమతులు ఉన్నందువల్ల జాతీయహోదా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఆంధ్రాలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు కేవలం 7,20,000 ఎకరాలకు మాత్రమే ఆయకట్టు ఉందని తెలిపారు. ఇదే కాళేశ్వరం ప్రాజెక్టు కింద 37 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని వివరించారు. జాతీయ హోదా కల్పిస్తే 90 శాతం నిధులు కేంద్రప్రభుత్వం, 10శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులు ఖర్చు చేసినట్టు చెప్తుందన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుండా ఉండేందుకు జాతీయహోదా కల్పించడం లేదన్నారు. కరువు ప్రాంతాలుగా ఉన్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించే పాలమూరు ఎత్తిపోతలకు కూడా జాతీయహోదా ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎంపిటిసి చెన్నబోయిన వెంకటేశం, బోయయాదయ్య పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి

అమరుల త్యాగం మరువం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమరుల త్యాగం పార్టీ ఎప్పటికి మరువదనీ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో నిర్వహించిన సిపిఎం నాయకులు మర్రి నర్సిరెడ్డి, సుక్క అబ్బయ్య, నడికుడి శంకరయ్య, నడికుడి బచ్చయ్యల 23వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో సిపిఎంను రాజకీయంగా ఎదుర్కొనే సత్తాలేని అరాచక ముఠా హత్యలకు పాల్పడిందన్నారు. హత్యలతో ప్రజాఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. అరాచక ముఠా నేడు కనుమరుగైందే తప్ప ప్రజానాయకులను కోల్పోయిన తమ పార్టీ మరింత ఆత్మధైర్యంతో ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఉద్యమాల ద్వారానే అడ్డుకోవాలన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి మైనార్టీ ప్రజలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతందని విమర్శించారు. మోడీ పాలనలో దేశ సార్వభౌమత్వం, లౌకికభావం దెబ్బతింటుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కేసీఆర్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎమ్‌డి జహంగీర్, కార్యదర్శి వర్గసభ్యులు దోనూరి నర్సిరెడ్డి, మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం శేఖర్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

స్పెషల్ మందుల పేరుతో దాటవేత

- నెలల తరబడి ఎదురుచూపులు
- డిస్పెన్సరీకి రెఫరల్ ఆస్పత్రికి మధ్య రోగుల పరుగులు
- సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి స్పందన కరువు
- ఇఎస్ఐ ఆస్పత్రుల్లో రోగుల ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇఎస్ఐ ఆస్పత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డాక్టర్లు రాసిన మందుల్లో కొన్నింటినీ తీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. డిస్పెన్సరీ నుంచి రెఫరల్ ఆస్పత్రికి మధ్య పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారాల తరబడి జరుగుతున్న కాలయాపనతో విసిగిపోతున్న రోగులు అనివార్యంగా ప్రయివేటును ఆశ్రయిస్తున్నారు.

రాష్ట్రంలో 20 లక్షల మందికిపైగా ఇఎస్ఐ కార్డుదారులున్నారు. వారి కుటుంబాలతో కలుపుకుని 80 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెలా వీరి నుంచి వాటా క్రింద సొమ్ము చెల్లించుకుంటున్న ఇఎస్ఐ యాజమాన్యం అదే స్థాయిలో సేవలందించలేకపోతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మందుల పంపిణీ విషయంలో ఈ విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. ఆస్పత్రుల్లో డాక్టర్లు రాసిన మందులు పూర్తి స్థాయిలో దొరకకపోగా వాటిని డిస్పెన్సరీల్లో తీసుకోవాలని రెఫరల్ ఆస్పత్రిలో సూచిస్తుండగా, రెఫరల్ ఆస్పత్రుల్లోనే దొరుకుతాయనీ డిస్పెన్సరీల్లో చెబుతుండటం గమనార్హం. అటూ, ఇటు తిరిగిన రోగులకు అవి కాస్తా ప్రత్యేక మందుల కేటగిరీలోకి వస్తాయంటూ నాలుగు రకాల డాక్యుమెంట్లను తెప్పించుకుని దరఖాస్తు చేయించుకుంటున్నారు. దీంతో రోగులు మందులు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి స్పందన లేదని డిస్పెన్సరీల్లో సిబ్బంది సమాధానమిస్తున్నారు.

మందులున్నాయా? లేవా?

డాక్టర్లు రాసిన మందుల కోసం రోగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది. తీరా తమ వంతు వచ్చాక మందులు లేవనే సమాధానం ఇస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అసలు రెఫరల్ ఆస్పత్రుల్లో ఏ మందులు అందుబాటులో ఉన్నాయి? డిస్పెన్సరీల్లో ఏ మందులు అందుబాటులో ఉన్నాయనే సమాచారం పారదర్శకంగా రోగులకు అందుబాటులో ఉంచాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక ప్రత్యేక మందులంటూ కాలయాపన చేస్తూ ప్రయివేటుకెళ్లేలా తప్పనిసరి పరిస్థితిని సృష్టించకుండా నిలువరించాలని కోరుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక మందుల కేటగిరీలో ఉంటే నిర్దిష్ట కాలపరిమితిలోపు ఆ మందులు అందుబాటులో ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని రోగులకు తెలపాలని ప్రజాసంఘాలు సూచిస్తున్నాయి. అన్ని మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

In The Court Of The IIIrd Additional District Judge : Kakinada
A.S.No.106/2019
Between:
Hanumanthu Madhuri
...Appellant /Defendant
AND
Karri Satyanarayana Reddy and Others
...Respondents ...Plaintiffs / Defendants 2,3
RESPONDENT:
R-1: Karri Satyanarayana Reddy, S/o. Late Veerreddy, Age 68 Years,Retired Employee, R/o. Rajanagar, Secunderabad.

పై నెంబరు అప్పీలు నందు 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.29-07-2022వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

బోయనపల్లి రాధాకృష్ణ,
ఎ.అనిల్‌కుమార్‌రాజా,
అడ్వకేట్స్, దో.నెం.6-1-9, జవహర్ స్ట్రీట్, కాకినాడ. కాకినాడ జిల్లా.
సెల్:94403 23951

పంటలు పదిలమా..?

- భద్రాద్రి జిల్లాలో గోదావరి వరద ముంపు
- ఖమ్మంలో అత్యధిక చోట్ల అధిక వర్షం
- పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ.. కుళ్లుతున్న వేర్లు
- పసుపు వర్ణంలోకి పత్తి.. చేలలో భారీగా కలుపు
- ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎడతెరపిలేని వానలతో పంటలు ఊటలు బారుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో చేలు ముంపునకు గురై ఎందుకూ పనికిరాకుండా దెబ్బతిన్నాయి. పరివాహక ప్రాంత పరిసర మండలాల్లోనూ పంట చేలలో నీరు నిలిచి పైరు వేర్లు కుళ్లిపోతున్నాయి. ఆకులు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. అటు మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు, దంతాలపల్లి, మరిపెడ తదితర ప్రాంతాల్లో శుక్రవారం 20 సెం.మీ వరకూ వర్షం కురిసింది. దాని ప్రభావంతో ఆకేరులోకి భారీగా వరద నీరు చేరింది. ఆ నీరంతా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద సీలేరు, మున్నేరుతో జత కట్టడంతో ఖమ్మం సరిహద్దున ఉన్న మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఎగువన మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుపై నిర్మించిన తరగపాడు-కోయచెలక ముప్పు పొంచివుంది. గోళ్లపాడు- తీర్థాల మధ్య వంతెనపై వరద నీరు నాలుగు అడుగుల మేర ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గుండాలతండా- మంగళగూడెం మధ్య లోలెవల్ వంతెన మున్నేటి ఉధృతికి కొట్టుకుపోయింది. అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి.

పంటలను ముంచిన గోదారి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి రైతులను కోలుకోని దెబ్బతీసింది. జిల్లాలో 99 గ్రామాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. 5,043 మంది రైతులపై దీని ప్రభావం పడిందని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా. 10831 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్టు గుర్తించారు. ఎకరానికి రూ.5,400 చొప్పున మొత్తం రూ.584.88 లక్షల నష్టపరిహారం కోసం కేంద్రానికి నివేదించనున్నారు. జిల్లాలో పత్తి 7,417, వరి 3,305, పెసలు ఏడు, ఇతరత్రా పంటలు 102 ఎకరాల్లో దెబ్బతిన్నాయని గుర్తించారు. ఉద్యాన పంటల విషయానికొస్తే 25 ఎకరాల్లో కూరగాయలు, పసుపు ఎనమిది, డ్రాగాన్‌ఫ్రూట్ రెండు ఎకరాలు, మొత్తం 35 ఎకరాల్లో రూ.40.50 లక్షల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల్లో ఎక్కువగా పంటలు గోదావరి ముంపునకు గురైనట్లు నివేదించారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ అధిక వర్షపాతమే నమోదైంది.

అధిక నష్టం

భద్రాద్రి జిల్లాలో గోదావరి ముంపు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాలు, ఖమ్మం జిల్లాలోని అనేక మండలాల్లో అధిక వర్షం కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5.91 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. పత్తి 2.69 లక్షలు, వరి 2.80 లక్షలు, మిర్చి 80వేలు, పెసర 25వేల ఎకరాల్లో సాగు చేయొచ్చని అంచనా వేశారు. దీనిలో పత్తి దాదాపు అంచనా మేరకు సాగు చేయగా మిగిలిన పంటల్లో వరి లక్ష ఎకరాల లోపు, మిర్చి నారు పోశారు. పెసర దాదాపు అంచనా మేరకు సేద్యం చేశారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా జిల్లాలో రైతు రెండు సార్లు పత్తి విత్తనాలు నాటాల్సి వచ్చింది. తొలుత నాటిన గింజలు అధిక వర్షాలకు భూమిలో నాని మొలకెత్తలేదు. దీనివల్ల రెండోసారి విత్తనాలు నాటాల్సి వచ్చింది. కొందరు రైతులు పూర్తిగా చెడగొట్టి సాగు చేయగా.. మరికొందరు రైతులకు చావు గింజలు అధికంగా పట్టాయి. అధిక వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లోని పత్తి చేలల్లో భారీగా నీరు నిలుస్తోంది. ఎడతెరపి లేని వర్షాలతో నల్ల నేలల్లో నాటిన పత్తి చేలలో నీరు నిల్వ ఉండి వేర్లు కుళ్లుతున్నాయని, ఆకులు పసుపు వర్ణంలోకి మారుతున్నట్టు రైతులు వాపోతున్నారు. ముసురు ప్రభావంతో ఎర్రనేలల్లో నాటిన పత్తి చేలల్లో కలుపు తీత సాధ్యం కావట్లేదని చెబుతున్నారు. అలుగులు, చెరువు శిఖం భూములు, పల్లపు ప్రాంతాల్లో నాటిని వరి, నారు దెబ్బతిన్నాయి. మిరప గింజలు నాటిన రైతులు అధిక వర్షాలకు గింజలు దెబ్బతినకుండా, కొట్టుకుపోకుండా మొలిచేందుకుగాను నారు మళ్లపై పాతచీరలు కప్పుతున్నారు. పెసర చేలల్లోనూ కలుపు బాగా పెరిగింది. గొంగళి పురుగుల ఉధృతి పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.

ఖమ్మం జిల్లాలో దాదాపు 2000 ఎకర